పాఠశాల లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 23: మదర్ థెరిసా పాఠశాల లైసెన్స్ ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని శ్రీకృష్ణ ధర్మరక్షణ వ్యవస్థాపకుడు కేడీ ఆర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 16న దండేపల్లి మండలం కన్నెపల్లిలో మదర్ థెరిసా మిషనరీ పాఠశాలలో హనుమాన్ స్వామి మాల వేసుకున్న విద్యార్థిని అవమాన పరిచారని, ఆ పాఠశాల లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ ధర్మరక్షణ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురి రిమాండ్

తాండూర్, ఏప్రిల్ 23 : పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ ఎస్ఐ కే జగదీశ్‌గౌడ్ మంగళవారం తెలిపారు. శనివారం రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను తాండూర్‌లో పట్టుకోగా వారి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ చేరుకొని దూషించడంతో డ్యూటీలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు గాను కేసు నమోదు చేసి ఫర్జానా బేగం, అమీనా బేగం, టీన బేగం, ముగ్దుం, మోసిన్, యూసుఫ్, నరేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ జగదీశ్ తెలిపారు.

దొంగతనం కేసులో..

కౌటాల, ఏప్రిల్ 23: మండలంలోని శివలింగపూర్ గ్రామ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బోదంపల్లికి చెందిన శ్రీకాంత్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో హుండీ తానే పగులగొట్టి డబ్బులను తీసుకెళ్లినట్లు నేరం ఒప్పుకున్నాడు. అతనిపై కేసు నమోదు చేసి డబ్బులను రికవరీ చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 23 : లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 తర్వాత ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. శారీరక వైకల్యం కలిగిన ఓటర్లు, 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు ఫాం-12డీ నింపి బూత్ అధికారికి అందజేయాలన్నారు. వారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు నిబంధనలు పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు తమ పార్టీ తరపున ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఏజెంట్ల వివరాలు అందించాలని సూచించారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికల్లో నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్, స్టాటిక్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసీఎంసీ కంట్రోల్ రూమ్, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు, ఎన్నికల సంబంధిత విభాగాల అధికారులతో పాటు అదనపు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ఈ నెల 24, 25వ తేదీల్లో ఆదిలాబాద్‌లో జరగనున్న సమావేశానికి హాజరుకావాలని, మే 9 నుంచి సెక్టార్ అధికారులకు వాహనాలను కేటాయిస్తామని పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణకు నియమించబడిన ప్రత్యేక బృందాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని షాడో ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దాసరి వేణు, దీపక్ తివారీ, రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మధుకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

ఫేర్‌వెల్ డే వేడుకల్లో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

నస్పూర్, ఏప్రిల్ 23 : మంచిర్యాల పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్‌డేను పద్మనాయక ఫంక్షన్ హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఫేర్‌వెల్ డే సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిమ్స్ డిగ్రీ కళాశాలలో..

మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ శ్రీనివాస రాజు, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

గూడెంలో ఘనంగా చైత్ర పౌర్ణమి జాతర

సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, ఏప్రిల్23: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం చైత్రపౌర్ణమి జాతర జరిగింది. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న భక్తులు సమీప గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు.గుట్టపైనున్న సత్యదేవుడిని దర్శించుకున్నారు. హనుమాన్ జయంతి కావడంతో భక్తులు ఉదయం వేళ అధిక సంఖ్యలో తరలివచ్చారు. 132 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు అవగాహన కల్పించాలి
- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

దండేపల్లి, ఏప్రిల్23: వడదెబ్బపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు ఆదేశించారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేట పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భం గా వైద్య సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతరత్రా అవసరమైన మందుల కొరత లేకుండా చూ సుకోవాలన్నారు. వడదెబ్బ బాధితులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయద్దన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఫయాజ్ ఖాన్, శివ ప్రతాప్, వైద్యాధికారులు క్రాంతి కుమార్, సతీశ్‌కుమార్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

దండేపల్లి : మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 23: పరీక్ష ఫలితాలు వెలువడుతున్న దృష్ట్యా విద్యార్థిని విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని డీఎంహెచ్‌వో జీ.సుబ్బారాయుడు అన్నారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల్లో ఫెయిలైతే అభద్రత భావాలకు లోను కావద్దన్నారు. వెంటనే సప్లిమెంటరీ పరీక్షలకు ప్రిపేర్ కావాలి తప్పా ఎలాంటి మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు. పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు జిల్లాలో మానసిక ఆరోగ్య కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 14416ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్ష ఫలితాలపై పిల్లల్లో మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. జిల్లా దవాఖానలో మానసిక వైద్య నిపుణుడు సునీల్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కౌటాల, ఏప్రిల్ 23: అకాల వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ అన్నారు. మంగళవారం వీరవెల్లి గ్రామంలో పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున రైతులు వరి పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అదే విధంగా కోసిన వరి పంట, ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బీమా చెక్కు అందజేత

వాంకిడి, ఏప్రిల్ 23 : సోనాపూర్ గ్రామానికి చెందిన మడావి విజయ ఇటీవల మృతి చెందింది. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకం కింద తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. నామినిగా ఉన్న మృతురాలి తండ్రి మడావి జలపతికి బ్యాంకు మేనేజర్ విష్ణువర్ధన్ మంగళవారం బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్, అకౌంటెంట్ అనిల్, క్యాషియర్ వాగు, సీఎస్సీ దుర్గం రాకేశ్ పాల్గొన్నారు

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వేమనపల్లి, ఏప్రిల్ 23 : భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్టోరియల్ అధికారి చౌదరి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు ప్రోగ్రెసివ్ రిపోర్టులను అందించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు సంతోషిరాణి, ఉపాధ్యాయులు శంకర్, రీసోర్స్ పర్సన్ మానిక తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 23: ఈ నెల 24న మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాలలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జాన్ తెలిపారు. దీంతో ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నస్పూర్ పట్టణంలో..

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 23: ఈ నెల 24న నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ రామ్మూర్తి పేర్కొన్నారు. మంచిర్యాలలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేపడుతుండడంతో ఉదయం 8 నుంచి 10గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

ప్రొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 23: మంచిర్యాల పట్టణంలో అర్చనటెక్స్ చౌరస్తాలో అజయ్‌స్పోర్ట్స్ దుకాణం ముందు రేకులతో వేసిన నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ప్రొక్లెయినర్‌తో తొలగించారు. ఈ స్థలంలో భవన యజమానులు టీ స్టాల్, మిర్చి బజ్జీ స్టాల్, జ్యూస్ సెంటర్ నిర్వాహకులకు కిరాయికి ఇచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో రద్దీగా మారి ట్రాఫిక్‌కు పెద్ద ఎత్తున ఇబ్బందులు తలెత్తేవి. తాజాగా మున్సిపల్ చైర్మన్‌గా ఉప్పలయ్య బాధ్యతలు చేపట్టాక పట్టణంలోని ఆక్రమణలను తొలగించాలని నేరుగా మొదటి కౌన్సిల్ సమావేశంలోనే తీర్మానించారు. ఆ మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

కే శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 23: రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ మహేందర్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీ నగర్‌లో నివాసం ఉంటున్న కాజీపేట శ్రీనివాస్ (52) సోమవారం రాత్రి పెద్ద కుమారుడు సాకిత్‌ను మంచిర్యాల బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కించిన తర్వాత బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగుతుండగా కారు అతి వేగంగా ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీన్నది. శ్రీనివాస్ తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలిస్తుండగా పెద్దపల్లి వద్ద శ్రీనివాస్ మృతి చెందాడు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య నర్మదాశిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీనివాస్ మంథనిలోని చందనాపూర్‌లో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. హెడ్‌మాస్టర్ ప్రమోషన్లో లిస్ట్‌లో ఉన్నట్లు తెలిసింది. శ్రీనివాస్‌కు ఇద్దరు పిల్లలు సాకిత్ (17), సౌమిత్రి (14)లు ఉన్నారు. భార్య శిరీష బెల్లంపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

మద్దిమాడ కాల్పుల ఘటనకు 36 ఏళ్లు..

- నేడు అమరుడు చేనేని భీమయ్య వర్ధంతి
- అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జరిగిన చేదు ఘటనను మర్చిపోని గిరిజనులు

చేనేని భీమయ్య (ఫైల్)

కాసిపేట, ఏప్రిల్ 23 : పోలీసుల కాల్పుల్లో అమరుడైన చేనేని భీమయ్య వర్ధంతిని బుధవారం మద్దిమాడ గ్రామంలో నిర్వహించేందుకు గిరిజనులు అన్ని ఏర్పాటు చేశారు. కాసిపేట మండలంలోని అప్పటి దేవాపూర్ గ్రామ పంచాయతీ, ప్రస్తుత మద్దిమాడ పంచాయతీలోని మద్దిమాడ గ్రామస్తులు 1988లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గిరిజనులకు పెంకుటిల్లు గృహాలు మంజూరు చేసింది. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన కర్రను అడవి నుంచి ఎడ్ల బండ్లలో అటవీ అధికారులు లాల్‌గూడ, మద్దిమాడ గ్రామాల మధ్య అడ్డుకున్నారు. వారితో గిరిజనులు వాగ్వాదానికి దిగారు. వెనుదిరిగిన అటవీ శాఖ అధికారులు పోలీసులతో వచ్చారు. అధికారులు మహిళలపై దౌర్జన్యం చేస్తూ దాడికి దిగారు. దీంతో ఆగ్రహించిన మద్దిమాడ గ్రామ గిరిజనులు ఎదురు దాడికి దిగడంతో ఎటువంటి హెచ్చరికలు లేకుండా పోలీసులు కాల్పులు చేశారు. ఈ కాల్పుల్లో చేనేని భీమయ్య అనే యువకుడు మరణించగా చెడ్మెకి కుద్దు, చెడ్డెకి భీంకావు, టేకం శంకర్, బద్ది పాపయ్య, మాడావి మారు భాయి, మాడవి జైతులకు గాయాలయ్యాయి. భీమయ్య స్మారకంగా ప్రతి ఏడాది ఏప్రిల్ 24న భీమయ్య వర్ధంతిని గిరిజనులు, గ్రామస్తులు నిర్వహిస్తున్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి : ప్రోగ్రెసివ్ కార్డులు అందించిన విద్యార్థులతో హెచ్ఎం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 23 : విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ కటుకం మధుకర్ అన్నారు. కాగజ్‌నగర్ సర్‌సిల్క్‌లోని జిల్లా పరిషత్ సెకండరి బాలికల పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఇంటికి తీసుకెళ్లేందుకు గ్రంథాలయ పుస్తకాలు, ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దండేపల్లి మండలంలో..

దండేపల్లి, ఏప్రిల్23: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎంలు విజయలక్ష్మి, శంకర్‌గౌడ్ అన్నారు. దండేపల్లితోపాటు, వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రోగ్రెసివ్ కార్డులు అందజేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి

నమస్తే, నెట్‌వర్క్, ఏప్రిల్ 23: మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు అన్ని మండలాల్లోని ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. ఆంజనేయ స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల శోభాయాత్రలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మంచిర్యాల ఏసీసీ : శోభాయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

ఆసిఫాబాద్ టౌన్ : పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌లో కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్ ప్రత్యేక పూజలు చేశారు. కాగజ్‌నగర్‌లోని హనుమాన్ ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్సీ దండె విఠల్‌తో పాటు ఆయా పార్టీల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, ప్రూటీ పంపిణీ చేశారు.
మంచిర్యాలలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వీరహనుమాన్ విజయయాత్ర ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీజేపీ నాయకుడు రఘునాథ్, బీఆర్ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

రాలిన మామిడి కాయలతో రైతులు

తాండూర్, ఏప్రిల్ 23 : తాండూర్ మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురవడంతో మామిడి తోటల రైతులకు పాక్షికంగా నష్టం కలిగించింది. బోయపల్లి, చౌటపల్లి, తాండూర్, కొత్తపల్లి, అచ్చలాపూర్, కాసిపేట, ద్వారకాపూర్‌తో పాటు పలు గ్రామాల పరిధిలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో రాత్రి కురిసిన గాలివానకు సుమారు 100 ఎకరాల మామిడి తోటల్లో మామిడి కాయలు పాక్షికంగా నేలరాలాయి. ఆరుగాలం కష్టపడి ఎంతో శ్ర మిస్తే తీరా ప్రకృతి ప్రకోపానికి పంట నేల రాలడంతో మామిడి రై తులు నిరాశ, నిస్పృహలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను, ఇతర రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సింగరేణి

సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డును రెన్యువల్ చేసుకోవాలి

మందమర్రి రూరల్, ఏప్రిల్ 23 : సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డును రెన్యువల్ చేసుకోవాలని రిటైర్డ్ కార్మికులు మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ మంగళవారం పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన వా రు సీపీఆర్ఎంఎస్(నాన్ ఎగ్జిక్యూటివ్)మెడికల్ కార్డు రెన్యువల్ కోసం ప్రతి సంవత్సరం నవంబర్‌లో లైవ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉందన్నారు. కానీ దాదాపు 1066 మంది మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు ఇప్పటివరకు లైవ్ సర్టిఫికెట్ సమర్పించలేదన్నారు. కార్డు రెన్యువల్ చేయకపోవడంతో మెడికల్ కార్డు సేవలు నిలిచిపోయినట్లు వివరించారు. ఇప్పటికైనా ఆన్‌లైన్ ద్వారా లైవ్ సర్టిఫికెట్ సమర్పించి వారి మెడికల్ కార్డును రెన్యువల్ చేసుకుని అత్యవసర వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు.

బీసీల్లో చైతన్యం తీసుకురావాలి

అభినందన సభలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 23: బీసీ వర్గాల్లో చైతన్యం కోసం బీసీ నాయకులంతా కృషి చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లాలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బీసీ చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా అభినందన సభను నిర్వహించారు. చైతన్య యాత్రను నిర్వహించిన నాయకులు వడ్డేపల్లి మనోహర్, నీరటి రాజన్న, చిందం వెంకటేశ్, కోమటి రాజు, ఎదులాపురం రాజును ఈ సందర్భంగా నాయకులు సన్మానించారు. దేశంలో మెజార్టీగా కొనసాగుతున్నా సరైన చైతన్యం లేక బీసీ వర్గాల ఆకాంక్షలను పాలకులు పట్టించుకోవడం లేదని నాయకులన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, సాహు మహారాజ్, బీపీ మండల్, విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ అందించిన ఉద్యమ స్ఫూర్తిని బీసీ బిడ్డలు పుణికిపుచ్చుకోవాలని కోరారు. బీహార్, తమిళనాడులో వెల్లివిరిసిన బీసీ చైతన్యం కారణంగానే ఆ రాష్ట్రాల్లో రాజ్యాధికారం బీసీలకు దక్కిందన్నారు. రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలను విరివిగా చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, శ్రీరామోజు కొండయ్య, చలమల అంజయ్య, చిలగాని సుదర్శన్, బుద్ధే చంద్రమౌళి, గుండేటి మధుకర్, పిట్టల రవీందర్, వేముల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసుల హక్కులకు రక్షణ కావాలి

మాట్లాడుతున్న తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్

మందమర్రి రూరల్, ఏప్రిల్ 23: ఆదివాసుల హక్కులను పరిరక్షించాలని తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల రవీందర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మందమర్రి మున్సిపాలిటీ 1/70 చట్టం పరిధిలో ఉన్నప్పటికీ సర్వేనంబర్ 385లోని భూములను కొందరు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జా కాకుండా ఆపాలని కోరారు. లేదంటే రానున్న రోజుల్లో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కూన సత్యనారాయణ, కూన వెంకటి, రాంబాయి,రాజేశ్వరి, తిరుపతి, గోపాల్ పాల్గొన్నారు.

బెహ్రూన్‌గూడలో గిరి గ్రంథాలయం ప్రారంభం

దండేపల్లి, ఏప్రిల్23: దండేపల్లి మండలంలోని బెహ్రూన్‌గూడలో లక్షెట్టిపేటకు చెందిన ఆశ్రమ పాఠశాల(బాలికలు)ఉపాధ్యాయులు, సిబ్బంది సౌజన్యంతో సావిత్రీబాయిపూలే గిరి గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద రాంపటేల్, శ్రీనివాస్, భీంరావు, పాఠశాల హెచ్ఎం గఫార్, వీ సత్యనారాయణ, స్పోర్ట్స్ అధికారి బండ జీవరత్నం, సత్యప్రియ, జ్యోతి, పుష్పలత, మంజుల, సంధ్యారాణి, అరుణ, రజిత, సతీశ్ ఉన్నారు.

బుక్ రీడింగ్ టెక్నిక్స్‌పై అవగాహన

నస్పూర్, ఏప్రిల్ 23 : అంతర్జాత